మోతాదుకు మించితే.. నష్టమే..



- రసాయనం అతిగా వాడితే అనర్థమే
- రసాయన మందుల పిచికారీలో జాగ్రత్తలు అవసరం
- అన్నదాతలు జాగ్రత్తలు పాటించాలన్న వ్యవసాయ అధికారులు

పూసపాటిరేగ: సాంకేతికత పెరుగుతున్నా.. వ్యవసాయ సాగులో రైతులు పాత పద్ధతినే అవలంభించి సాగుకు వ్యయం ఎక్కువగానే పెడుతున్నారు. రైతులు సరికొత్త పద్ధతుల్లో సాగు చేయడంతో రసాయన పురుగు మందులు వినియోగం కూడా రోజు రోజుకు పెరుగుతోంది. విత్తనాలు చల్లడం నుంచి పంట చేతికి అంది వచ్చే వరకు పురుగు మందులు వినియోగంపై రైతులు అవగాహన కలిగి వుండాలి. లేని పక్షంలో పంట దిగుబడి దెబ్బతినడంతో పాటు రైతు నష్టాలు బారిన పడాల్సి వస్తుంది. పంటల సాగులో అధికంగా పురుగు మందులు వినియోగిస్తే ప్రమాదమని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు. మోతాదుకు మించి రసాయిన ఎరువులు, క్రిమి సంహారక మందులు వినియోగిస్తే పంటపై ప్రభావం పడుతుందని, రైతులు వ్యవసాయ సిబ్బంది సూచనలు, సలహాలు పాటించాలని సూచిస్తున్నారు. క్రిమిసంహారక మందులు, రసాయిన ఎరువులు అధికంగా వినియోగిస్తే భూసారం తగ్గడంతో సహజత్వాన్ని కోల్పోతాయని హెచ్చరిస్తున్నారు. దీంతో లాభం కంటే నష్టమే అధికంగా ఉంటుందని చెబుతున్నారు. పంటకు నీటి తడి అందించిన తర్వాత ఉదయం వేళల్లో పంటకు పిచికారీ చేస్తే ఫలితం ఉంటుందని పేర్కొంటున్నారు. 25 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్న సమయంలో పంటలకు పిచికారీ చేయాలని చెబుతున్నారు. రైతులు పలు జాగ్రత్తలు తీసుకొని పిచికారీ చేస్తే ప్రమదాలు నుంచి గట్టిక్కవచ్చునని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

పిచికారీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

గాలికి ఎదురుగా రసాయన మందులు పిచికారీ చేయకూడదు. తెగులు మందు, పురుగు మందు కలిపి పిచికారీ చేయాలి. చేతులకు గ్లౌజులు, నోరు, ముక్కుకు మాస్కులు వేసుకోవాలి. మందులు పిచికారి చేసి కళ్లు, ముక్కు, నోరు, చేతులతో రుద్దుకోరాదు. భోజనానికి ముందు చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. రసాయిన మందులు పిచికారీ సమయంలో స్ప్రేయర్లు లీకేజి ఉండరాదు. ద్రావణం కలిపే మందు డబ్బాపై సూచించిన మేరకుగాని, వ్యవసాయ అధికారులు సూచించిన మేరకుగాని పిచికారి చేయాలి. భోజనానికి ముందు చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. రసాయన మందు పిచికారీ చేసే సమయంలో కడుపు మంట, దద్దుర్లు వస్తే చికిత్స తీసుకోవాలి.

అతిగా వాడరాదు



వ్యవసాయశాఖ సిబ్బంది సూచించిన మేరకు తగిన మోతాదులో పంటకు ఉదయం వేళల్లో పిచికారీ చేయాలి. ముఖానికి మాస్కులు, చేతులకు గ్లౌజులు, కళ్లకు అద్దాలు ధరించి పిచికారీ చేయాలి. కలుపు మందు కొట్టిన తరువాత పురుగు మందు కొట్టరాదు. మొక్కలు పైభాగంతో పాటు కిందభాగం తడిసిపోయేలా పిచికారీ చేస్తే ఆకు కింద వున్న రసం పీల్చే పురుగులు నశిస్తాయి.

– కొల్లి నీలిమ, వ్యవసాయ అధికారి, పూసపాటిరేగ

ఐసీడీఎస్‌ను క్రమబద్ధీకరించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంగవేణి

నెల్లిమర్ల: అఖిల భారత కమిటీ పిలుపు మేరకు ఐసీడీఎస్ క్రమబద్ధీకరణ, గ్రాడ్యుటి, కనీస వేతనం రూ.26వేలు అమలు తదితర సమస్యలపై విజయనగరం అర్బన్ – రూరల్‌లో సెక్టార్ మీటింగ్‌లు సందర్భంగా వ్యక్తిగత దరఖాస్తులు రాసి పోస్టల్ ద్వారా గౌరవ రాష్ట్రపతికి పంపిస్తున్నామని ప్రాజెక్ట్ గౌరవ అధ్యక్షురాలు మంగ వేణి తెలిపారు. ఈ సందర్భంగా నెల్లిమర్ల సెక్టార్ సమావేశంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ఐసీడీఎస్ ఏర్పాటై యాభై ఏళ్లు పూర్తయిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఐసీడీఎస్‌ను క్రమబద్ధీకరించి, బడ్జెట్లో కేటాయింపులు పెంచాలన్నారు. దశాబ్దాలుగా సర్వీస్ అందిస్తున్న వర్కర్లకు, హెల్పర్లకు కనీస వేతనం రూ.26వేలు అమలుతో పాటు, సుప్రీంకోర్టు గైడ్‌లైన్ల ప్రకారం గ్రాడ్యుటి చెల్లించే విధంగా గౌరవ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్షయ లక్షణాలు కనిపిస్తే పరీక్ష చేయించుకోవాలి



ప్రతిజ్ఞ చేస్తున్న డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ ఆనందరావు తదితరులు

విజయనగరం ఫోర్ట్: క్షయ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి కఫం పరీక్ష చేయించుకోవాలని సీనియర్ హోమియో వైద్యాధికారి జి.వరప్రసాద్, ఆయుర్వేద వైద్యాధికారి ఎం.ఆనందరావు సూచించారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మంగళవారం హోమియో డిస్పెన్సరీ వద్ద ఆయుష్ శాఖ డిస్పెన్సరీలకు వచ్చే రోగులను క్షయ నివారణ కేంద్రాలకు పంపిస్తామని ప్రతిజ్ఞ చేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షయ వ్యాధి సోకిన వారు క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధి నయం అవుతుందని తెలిపారు. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం అవుతుందని తెలిపారు. ఆయుష్ శాఖ డిస్పెన్సరీలకు వచ్చే రోగులకు క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నేచురోపతి వైద్యురాలు చైతన్య స్వప్న, వెంకటలక్ష్మి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద రహిత రవాణా సేవలే లక్ష్యం

- ఆర్టీసీ ఎండీ, రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు



మాట్లాడుతున్న ఆర్టీసీ ఎండీ, రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు

విజయనగరం అర్బన్: రాష్ట్రంలో ఆర్టీసీ రవాణా సేవలు ప్రమాద రహితంగా ఉండాలని అందుకోసం సిబ్బంది చిత్తశుద్ధితో పని చేయాలని ఆర్టీసీ ఎండీ, రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు ఆదేశించారు. జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం పట్టణానికి వచ్చిన ఆయన స్థానిక ఆర్టీసీ డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంస్థ సిబ్బంది పనితీరులో మరింత నాణ్యత పెంచాలని సూచించారు. కరోనా అనంతరం సంస్థ కార్గో సేవల వృద్ధి మెరుగ్గా ఉందని సిబ్బంది మరింత శ్రద్ధ చూపితే సంస్థ ఆదాయాన్ని పెంచుకోవచ్చన్నారు. సిబ్బందికి రావాల్సిన బకాయిలను ఇచ్చేసామని, జీవిత బీమాను ప్రతి ఒక్క సిబ్బందికి వర్తించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం జిల్లాలో ప్రమాద రహిత సేవలు అందించిన డ్రైవర్లు ఎస్.శివాజీ, వి.రాజు, వై.ముత్యాలుకు ప్రశంసాపత్రాలు, నగదు బహుమతితో సత్కరించారు. విశాఖ రేంజి డీఐజీ గోపినాథ్‌జెట్టి, విజయనగరం ఎస్పీ వకుల్ జిందల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో విజయనగరం జోన్ ఈడీ ఎ.విజయ్‌కుమార్, విజయనగరం జోన్ కమర్షియల్ మేనేజర్ బి.అప్పలనాయుడు, జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు, విశాఖ డిప్యూటీ సీటీఎం జి.సత్యనారాయణ, విజయనగరం డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు, కార్మిక సంఘాల ప్రతినిధులు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన త్యాగరాజస్వామి ఆరాధనోత్సవం



గాత్రకచేరీ నిర్వహిస్తున్న కవిరాయుని శారద

విజయనగరం టౌన్: స్థానిక మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో మంగళవారం త్యాగరాజస్వామి ఆరాధనోత్సవం చూపరులను అలరించింది. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కెవిఎల్ఎన్.శాస్త్రి ఆధ్వర్యంలో ఉదయం పంచరత్న సేవను నిర్వహించారు. సాయంత్రం కార్యక్రమంలో కాకినాడ టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ ఆర్టిస్ట్ కవిరాయుని శారద గాత్రకచేరీ ఆద్యంతం ఆహుతులను కట్టిపడేసింది. వయోలిన్‌పై ఎగ్రేడ్ ఆర్టిస్ట్ యం.నీలాద్రిరావు, మృదంగంపై ఆల్ ఇండియా రేడియో నిలయ విద్వాంసులు ఎ టాప్ గ్రేడ్ ధన్వాడ ధర్మారావులు సహకరించారు. అధిక సంఖ్యలో కళాశాల విద్యార్థులు, సంగీతాభిమానులు పాల్గొన్నారు.

బెదిరించి.. బంగారం, సెల్ లాక్కొన్నారు...

విజయనగరం క్రైమ్: తనను బెదిరించి చేతులతో కొట్టి తన మెడలో ఉన్న బంగారపు గొలుసు, ఉంగరం, మొబైల్‌ను లాక్కొన్నట్లు పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరుకి చెందిన యంటపల్లి అభిరామ్ మంగళవారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ అందించిన వివరాలిలా ఉన్నాయి. కాంపిటేటివ్ పరీక్షలకు ప్రిపేరవుతున్న అభిరామ్ ఉడా కాలనీ, పాల్‌నగర్ ఆరో లైన్‌లో స్నేహితులతో కలిసి నివాసం ఉంటున్నాడు. హరీష్ అనే స్నేహితుడి ద్వారా తరుణ్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. ఈ నెల 24న రాత్రి పది గంటల సమయంలో గదిలో ఉండగా తరుణ్ మరో ఇద్దరు వ్యక్తులతో వచ్చి కిందకు రమ్మన్నాడన్నారు. తాను కిందకి వెళ్లగా తనకు డబ్బులు అవసరం ఉందని అడిగాడని, అయితే తన దగ్గర లేవనే సరికి గొడవకు దిగి డబ్బులివ్వమని అడిగాడన్నారు. లేవని చెప్పి అభిరామ్ రూమ్‌లోకి వెళ్లిపోయానన్నాడు. కొద్ది సమయానికే ముగ్గురు కలిసి గదిలోకి అక్రమంగా ప్రవేశించి గదిలో గడియపెట్టి, బెదిరించి చేతులతో కొట్టి, తన మెడలో ఉన్న బంగారపు గొలుసు, బంగారపు ఉంగరం, మొబైల్‌ను తీసుకున్నారన్నారు. వాళ్లలో వాళ్లు మాట్లాడుకున్నప్పుడు వాళ్ల పేర్లు శ్రీను, వెంకటరమణలుగా అనుకుంటే విన్నానని ఫిర్యాదులో బాధితుడు పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

పూసపాటిరేగ: కల్లుగీత కార్మికుల నుంచి మద్యం షాపులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భోగాపురం ఎక్సైజ్ సీఐ రవికుమార్ తెలియజేసారు. జిల్లాకు సంబంధించి యాత–9, సెగిడి–3, శ్రీశయిన–1, శెట్టిబలిజ–2 షాపులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో సెగిడి సబ్ కులానికి మండలానికి ఒక్కటి చొప్పున షాపులు కేటాయించినట్లు తెలిపారు. మద్యం దుకాణం కేటాయింపు ప్రక్రియలో పాల్గొనదలచిన ఔత్సాహికులు దరఖాస్తుతో పాటు రూ.2 లక్షలు నాన్ రిఫండ్‌బుల్ చలానా లేదా డీడీ, ఆధార్ కార్డు, ఫొటోస్ – 4, సంబంధిత మండల తహసీల్దార్ జారీ చేయబడిన ఇంటిగ్రేటెడ్ కులం సర్టిఫికెట్ జత చేసిన దరఖాస్తులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులను అందజేయాలన్నారు. నేటి నుంచి ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తు అందజేయాలన్నారు.

నెల్లిమర్లలో..

నెల్లిమర్ల: నెల్లిమర్ల రూరల్ మండలంలో కొత్తగా మద్యం దుకాణం ఏర్పాటు చేసుకోవటానికి యాత కులానికి చెందిన కల్లుగీత కార్మికులు దరఖాస్తు చేసుకోవాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఎం.వెంకటరావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. యాత కులానికి చెందిన కల్లుగీత కార్మికుల కోసం ప్రభుత్వం కేటాయించిన దుకాణం నెల్లిమర్ల రూరల్ మండలంలో ఏర్పాటు చేసుకోవటానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. వివరాలకు నెల్లిమర్ల పట్టణంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను సంప్రదించాలని సీఐ సూచించారు.

8నుంచి సూఫీ సుగంధ మహోత్సవాలు

విజయనగరం టౌన్: హజరత్ బాబా ఖాదర్‌వలీ మహాత్ముల వారి 66వ సూఫీ సుగంధ మహోత్సవాలు ఫిబ్రవరి 8, 9, 10 తేదీల్లో బాబామెట్టలో నిర్వహించనున్నారు. ఈ మహోత్సవాలకు సంబంధించి రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ జనాబ్ అబ్దుల్ అజీజ్‌ను ఆహ్వానిస్తూ ఖాదర్ బాబా దర్గా, దర్బార్ షరీఫ్ ముతవల్లి డాక్టర్ ఎండీ ఖలీలుల్లా షరీఫ్ మంగళవారం విజయవాడలోని రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ కార్యాలయంలో ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా ఉత్సవ సంప్రదాయాన్ని గుర్తు చేసుకుంటూ వక్ఫ్‌బోర్డు ప్రతినిధులు బాబాకు పవిత్ర చాదర్‌ను సమర్పించింది. ఆధ్యాత్మిక సామాజిక రంగాల్లో ఖలీల్‌బాబు చేస్తున్న సేవలను గుర్తించి వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, బోర్డ్ డైరెక్టర్ ఖాజా, సభ్యులు అభినందనలు తెలిపారు.

నగరంలో నీటి సరఫరాకు అంతరాయం

విజయనగరం: మధుపాడ పంపింగ్ లైన్ అయ్యన్నపేట దగ్గర లీకైన కారణంగా నగరంలోని కొన్ని ప్రాంతాలకు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. 38, 39, 40, 41 డివిజన్లకు సంబంధించి బొగ్గులదిబ్బ, అంబేడ్కర్ కాలనీ, ఎల్‌బీకాలనీ, పోలయ్యపేట, కుసుమగజపతినగర్, వివేకానంద కాలనీ, సాలిపేట, ఆదిత్య నగర్, బొబ్బాదిపేట, మహాలక్ష్మినగర్, సూర్యనగర్ ప్రాంతాలలో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. ఇప్పటికే మరమ్మతులు చేపట్టడం జరిగిందని పనులు పూర్తయిన వెంటనే నీటి సరఫరా యథాతధంగా చేస్తామని తెలిపారు. నీటి పంపిణీ జరగని ప్రాంతాలలో ప్రత్యామ్నాయంగా వాటర్ ట్యాంకుల ద్వారా నీటి పంపిణీ చేపడతామని ఆయన ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

ఫిబ్రవరి 15 వరకు ఈకేవైసీ గడువు

నెల్లిమర్ల రూరల్: రబీ సీజన్‌లో పంటలకు వచ్చే నెల 15లోపు రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని ఏఓ పూర్ణిమ సూచించారు. మండలంలోని కొండగుంపాం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మొక్కజొన్న పంటలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. రబీ సాగుకు గ్రామ వ్యవసాయ సహాయకుల సూచనలు, సలహాలు తీసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ వితరణ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న సర్పంచ్, హెచ్‌ఎం

పూసపాటిరేగ: భోగాపురం మండలం రెడ్డికకంచేరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు సర్పంచ్ బైరెడ్డి రమణారెడ్డి స్టడీ మెటీరియల్‌ను మంగళవారం వితరణగా అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు శత శాతం ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థి దశలో తొలిమెట్టు అయిన పదవ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణతో పాటు ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



లక్ష్మీనారాయణను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని కొప్పెర్ల గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు పుప్పాల లక్ష్మీనారాయణను నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మంగళవారం పరామర్శించారు. ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కోనాడ గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న దాడిశెట్టి గోవిందరావును పరామర్శించారు. ఆయనతో పాటు మహంతి జనార్దనరావు, దాడిశెట్టి త్రినాధరావు, మహంతి లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

తస్మాత్..!



చినపతివాడలో ప్రమాదాలకు నిలయంగా మారిన రహదారి

పూసపాటిరేగ: మండలంలోని చినపతివాడ గ్రామంలో ఆర్అండ్‌బీ రహదారి ప్రమాదాలను ఆహ్వానిస్తుంది. గ్రామ ముఖద్వారం మలుపు వద్ద రహదారి సమీపంలో పెద్ద గొయ్యి ఏర్పడటంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. నిత్యం ఆ రహదారి గుండా వందలాది వాహనాలు ప్రయాణం చేస్తుంటాయి. తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా కనీసం పట్టించుకోలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేసి ప్రమాదాలు నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

పైడితల్లికి నృత్య నీరాజనం



అమ్మవారి నృత్య రూపకాన్ని ప్రదర్శిస్తున్న భగవతీ నృత్య కళామందిర్ చిన్నారులు

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారికి భగవతీ నృత్య కళామందిర్ చిన్నారులు నృత్య నీరాజనం సమర్పించారు. మంగళవారం రాత్రి చదురుగుడి ఆధ్యాత్మిక కళావేదికపై అమ్మవారి జీవిత చరిత్రను నృత్య రూపకంలో ప్రదర్శించి భక్తుల ప్రశంసలు పొందారు. అమ్మవారిని కీర్తిస్తూ చేసిన పలు ప్రదర్శనలు రక్తికట్టించాయి. చివరగా వేంకటేశ్వరస్వామి హారతి చూపరులను భక్తి పారవశ్యంలో ముంచెత్తింది. ఆలయ అధికారులు భగవతీ నృత్య కళామందిర్ చిన్నారులను, డ్యాన్స్ డైరెక్టర్ వడ్డమాని రమణకుమారిలను దుశ్శాలువతో సత్కరించారు.

కొత్తపేటలో 'ఉల్లాస్'



మహిళలకు అవగాహన కల్పిస్తున్న వెలుగు అధికారులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామంలో ఉల్లాస్ కార్యక్రమాన్ని వెలుగు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ప్రాథమిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, ఆరోగ్య సంరక్షణపై మహిళలకు అవగాహన కల్పించారు. నిరక్షరాస్యులను గుర్తించి ఉల్లాస్ యాప్‌లో నమోదు చేశారు. వయోజన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఉల్లాస్ కార్యక్రమం ఇన్‌చార్జి జయరాం తెలిపారు. తద్వారా సమాజంలో నిరక్షరాస్యతను తొలగించే కార్యక్రమానికి సమష్టిగా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళ సంఘాల సభ్యులు, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

2న అవంతిలో ప్రగ్యాన్ 2కే25 పోలీఫెస్ట్



భోగాపురం మండలంలోని చెరుకుపల్లి అవంతి కళాశాలలో ప్రగ్యాన్2కే పోలీఫెస్ట్ కార్యక్రమం ఫిబ్రవరి 2వ తేదీన జరగనున్నట్టు కళాశాల చైర్మన్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. ప్రగ్యాన్ 2కె25 పోలీఫెస్ట్ ప్రోగ్రాం పోస్టల్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవానికి వివిధ కళాశాలల నుంచి విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రయోగాలపై నైపుణ్యం, భవిష్యత్‌పై దిశా నిర్దేశం చేస్తారన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక నైపుణ్యాలపై దృష్టి సారించాలని, మంచి భవిష్యత్‌ను నిర్మించుకోవాలనే ఉద్దేశంతో ఈ ఫెస్ట్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. – పూసపాటిరేగ

ఈవీఎం గోదాములను పరిశీలించిన కలెక్టర్



ఈవీఎం గోదాములను కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మంగళవారం తనిఖీ చేశారు. షట్టర్లకు వేసిన సీళ్లను, సీసీ కెమెరాలను పరిశీలించారు. సీసీ కెమెరా ఫీడ్‌ను ప్రతీ 15రోజులకోసారి భద్రపరచాలని సూచించారు. ఆయన వెంట డీఆర్‌ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్‌డీఓ దాట్ల కీర్తి, తహసీల్దార్ పి.సుదర్శనరావు, ఎన్నికల సూపరింటెండెంట్ భాస్కరరావు, ఎన్నికల విభాగం డీటీ వివిఆర్.జగన్నాధరావు తదితరులు పాల్గొన్నారు. – నెల్లిమర్ల

ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించాలి



ఆరోగ్య కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవనరాణి అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఏపీ హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ మీడియా ఆఫీసర్స్ అసోసియేషన్ 2025 డైరీ, క్యాలెండర్‌ను ఆమె మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డయేరియా, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ప్రజలకు వివరించాలన్నారు. డీఐఓ డాక్టర్ రెడ్డి అచ్చుతకుమారి, డీఎంఓ వై.మణి, డెమో వి.చిన్నతల్లి, హెచ్ఈఈఓ పి.రత్నకుమారి, డిప్యూటీ డెమో ఎస్.రమణ, ఫార్మసిస్ట్ అమృతవల్లి, సీహెచ్ఓ చంద్రశేఖరరావు, హెల్త్ ఎడ్యుకేటర్ అనిల్ పాల్గొన్నారు. – విజయనగరం ఫోర్ట్

పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు



పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న చదురుగుడి పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజాము నుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సిరిమానుపూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్‌లు శాస్త్రోక్తంగా పూజాధికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధనలు చేశారు. కార్యక్రమాలను ఆలయ ఇన్‌చార్జి ఈఓ కెఎన్‌విడివి.ప్రసాద్ పర్యవేక్షించారు.

పైడితల్లి దీవెనలు అందరిపైనా ఉండాలి



అమ్మవారి జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాలుగెస్సుల రాజు తదితరులు

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారి దీవెనలు అందరిపైనా ఉండాలని సాగి శివసీతారామరాజు స్మారక కళాపీఠం వ్యవస్థాపకులు నాలుగెస్సుల రాజు పేర్కొన్నారు. కోట జంక్షన్ నుంచి అమ్మవారి ఆలయం వరకూ మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పైడితల్లి అమ్మవారు ఆత్మార్పణ, అవతరణ దినం పురస్కరించుకుని ర్యాలీ, ఉపవాస దీక్షలు చేపట్టామన్నారు. ఈ సందర్భంగా చదురుగుడి వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి జీవిత చరిత్రపై పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాపీఠం ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన



పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

విజయనగరం: నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లన్నయ్య ఆదేశాలతో వివిధ అపార్ట్‌మెంట్‌లకు చేరుకున్న సిబ్బంది పీఎం సూర్యఘర్ పథకం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కొంతమంది సిబ్బందిని బృందాలుగా ఏర్పడి నగరంలో ఉన్న అన్ని అపార్ట్‌మెంట్‌లు, గృహ సముదాయాలు వద్దకు వెళ్లి అవగాహన కల్పించడంతో పాటు సౌర విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేసుకునే విధంగా చైతన్య పరచాలని కమిషనర్ ఆదేశించారు. మంగళవారం నుంచి పలు టీములు అపార్ట్‌మెంట్‌లు, గృహ సముదాయాలు వద్దకు వెళ్లి పీఎం సూర్యఘర్ పథకం కింద ప్రభుత్వం అందిస్తున్న రాయితీల వివరాలను వెల్లడించారు. అలాగే సూర్యఘర్ పథకం ద్వారా చేకూరనున్న ప్రయోజనాలను వివరించారు. 1 కిలో వాట్ యూనిట్‌కు రూ.30వేలు, 2 కిలోవాట్ల యూనిట్‌కు రూ.60 వేలు, 3 కిలోవాట్ల యూనిట్ ఏర్పాటుకు రూ.78 వేలు ప్రభుత్వం సబ్సిడీగా అందిస్తుందన్నారు. అలాగే బ్యాంకు రుణ సౌకర్యం కూడా అందిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ పీఎం సూర్యఘర్ పథకంలో చేరి విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం ఇచ్చే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, ప్రణాళిక సిబ్బంది, విద్యుత్ శాఖ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

క్రీడా రంగంలో ఖ్యాతి పొందిన విజయనగరం



కోడిరామ్మూర్తి చిత్రపటంతో నిర్వహిస్తున్న ర్యాలీ

విజయనగరం: విజయనగరంలో క్రీడా విలువలు, ప్రావీణ్యత గలవారు ఉండటం పట్ల ఎమ్మెల్యే అతిథి విజయలక్ష్మి గజపతి అభినందనలు తెలిపారు. మంగళవారం కలియుగ భీముడు, ఆంధ్రా హెర్క్యులస్ కోడి రామమూర్తి నాయుడు ఆరాధనోత్సవాలు శ్రీ కోడి రామమూర్తి వ్యాయామం సమాజం విజయనగరం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సమాజం నిర్వాహకులు పెద్ది లక్ష్మీనారాయణ అధ్యక్షుడుగా జరిగిన కార్యక్రమంలో భాగంగా బెంగళూరుకు చెందిన బి.ప్రవీణ్ అతివేగవంతమైన కారును ఆపి అతిథి విజయలక్ష్మిచే ప్రశంసలు అందుకున్నారు. అలాగే 150కి.మీ. వేగవంతమైన రెండు వ్యతిరేక దిశలో పయనించే బైకులు అదుపు చేసి ఆపిన ధనరాజ్‌ల ప్రతిభను కొనియాడారు. అనంతరం జరిగిన సభలో ఇరువురు క్రీడా, వ్యాయామకారులను, నేషనల్ బాక్సర్ సంతోష్, ఏషియన్ సబ్ జూనియర్ గోల్డ్ మెడలిస్ట్ ఉషా, కామన్ వెల్త్ చాంపియన్ సంతోషిలను ఉచిత రీతిని శాలువాతో సన్మానించారు. ఇక్కడ క్రీడా యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రభుత్వాన్ని కోరుతామని అన్నారు. జిల్లాలోని మొదటి వ్యాయామం క్రీడాకారిణి సంతోషతో పాటు పలువురిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సమాజ సేవకుడు పల్లంట్ల రామారావు, మాజీ కౌన్సిలర్ పెనుమజ్జి విజయలక్ష్మి, ఎన్‌సీసీ విద్యార్థులు, పలువురు క్రీడాకారులు, వ్యాయామ సమాజం సభ్యులు పాల్గొన్నారు. అనంతరం నగరంలో కోడి రామ్మూర్తి చిత్రపటంతో కోట వరకు ర్యాలీ నిర్వహించారు. పలువురు చిన్నారులు కత్తి స్వాము, పలు సాహస విద్యలు ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు.